

# జారుడు మెట్లు

దేవరకొండ
గంగాధర రామారావు

రామం సందిగ్ధావస్థలో పడ్డాడు. సందిగ్ధం క్రమంగా జీవిత సమస్యగా మారింది, సమస్య మానసిక పోరాటం అయింది. కొన్ని సాంప్రదాయాలకి, కట్టుబాట్లకి లోబడి నడిచిన రామం జీవితం తిరగబడుతోంది. కోరికల కొరడాలతో దండిస్తూంది. నిలువెత్తుగా ముందు నిలబడి ప్రశ్నిస్తోంది. కవ్విస్తోంది.

ఎం.ఎ. పరీక్షలకి చదువు కోసం వచ్చి ఈ చిన్న పెంకుటింటి గది అద్దెకు తీసుకున్నాడు. అదే అతన్ని చదువుకు దూరం చేసి కొత్త పరీక్షకు గురి చేసింది.

రామం జీవితాన్ని ఇంత బలంగా తల క్రిందులు చేసింది ఆ యింటివాళ్ళ అందమైన అమ్మాయి, రాగిణి. ఆమెలో యౌవనం పొంగులు వారుతూంది. ఆమెపోగ కన్నుల అంచుల నుండి సంగీతం వినిపిస్తోంది. ఆమె అందమైన వంపులు ఖజురాహో శిల్పాలను గుర్తు చేస్తున్నాయి. ఆమెబారెడు నల్లని జడ సుందర స్వప్నంలా, చీకటి తప్పలా మురిపిస్తోంది. ఆమెలోని స్త్రీత్వపు ఆకర్షణ అతని చుట్టూ విద్యుద్వలయంలా ఆవరిస్తోంది. ఇది ప్రకృతి శక్తి! రామం చదువు, నియమాలు, ఆదర్శాలు గాజు తలుపుల్లా ముక్కలు కావడానికి సిద్ధంగా వున్నాయి.

కాలేజిలో చదువుకునే రోజుల్లో రామం ఆడపిల్లలు కనబడితే తల వంచుకు నడిచేవాడు. 'రామం మంచి పిల్లవాడు. బుద్ధిగా వుండును' అని ఓ పెద్ద మనిషి బోర్డు మెడకు కట్టుకు తిరిగాడు. అందువలన కాలేజిలో ఆడపిల్ల లెవరూ అతడిని పట్టించుకోలేదు. కనీసం అతని వైపు ఓర చూపులైనా విసరలేదు. విసిరినా అవి అతని వంచిన తల మీద నుంచి దూసుకు పోయాయి. అతని కాలేజి జీవితం మర్యాదగా ముగిసింది.

రామానికి ఆడపిల్లలంటే ఇష్టం లేకకాదు. అతని గుండెలలోనూ కోరికల అగ్నిపర్వతాలున్నాయి. చెలియలి కట్టలు దాటి ముంచెత్తే ఉద్విగ్న సముద్రాలున్నాయి. కాని అతను పెరిగిన ఇంటి వాతావరణం, సంస్కారం అతనికి కొన్ని బాధ్యతలు నేర్పింది. కొన్ని పరిధులు గీసింది. విచ్చల విడితనంలో వినోదం వుందని తెలుసు. కాని దాని వెనుక దాగి వున్న విషాదాన్ని కూడా గమనించాలి. ఈ అవగాహనే రామాన్ని కళ్ళెం పట్టుకు లాగుతూంది.

ఒకరోజు రామం స్నేహితుడు మధుమూర్తి రామం గదికి వచ్చాడు. అతని జీవితపుటవగాహనే వేరు. జీవితంలో అందం, ఆనందం ఆఖరి చుక్క వరకు ఆస్వాదించాలన్నదే అతని సిద్ధాంతం. ఈ శృంగారాన్వేషణలో ఎవరుఎంత మూల్యం చెల్లించాలి అన్న ప్రశ్నలు అతనికి అప్రస్తుతం. మధుమూర్తి ఇంటి వాళ్ళమ్మాయి రాగిణిని చూసి ముగ్ధుడై పోయాడు. రామాన్ని మందలిస్తూ అన్నాడు.

"ఇంత అందాల గనిని

ఇంత సమీపంలో పెట్టుకుని నువ్వు ఏం సాధించినట్టు? నీకు రాత్రులు నిద్ర పడుతోందా? అయితే నువ్వసలు మనిషివే కావు!"

రామం సిగ్గు పడ్డాడు. తనను వేధిస్తున్న సమస్య వివరించాడు. "చూడు మధూ, ఆమెను నేను భార్యగా స్వీకరించలేను. మా మధ్య అంతస్తుల తేడాలున్నాయి. ఆమెతో వివాహం మా తల్లిదండ్రులు హర్షించరు. ఆమెను వివాహం చేసుకునే ధైర్యం లేని నేను ఇప్పుడు ఆమెతో ఏ ముఖం పెట్టుకుని శృంగార లీలలు సాగించమంటావ్?"

మధుమూర్తి విరగబడి నవ్వాడు. రామం దగ్గర నుంచి ఇలాంటి సమాధానమే వస్తుందని అతను ముందే ఊహించాడు. "చూడు రామం, ఆదర్శం పిరికితనానికి మరో పేరు! కోరికల ప్రమాదాల నుండి జీవితం భీమా చేసుకుంటే వందేళ్ళ జీవితం సైడుకాలవలో కలిసిపోతుంది. జీవితంలో కొత్తదనం కావాలి. సాహసం కావాలి. శృంగారాన్ని నీతిశతకాల్లోనూ, పెళ్ళి మంత్రాలలోనూ, పాతివ్రత్యపు ఇనుప కచ్చడాల్లోనూ బిగించకు. నీ చుట్టూ ప్రపంచం మారింది. ఒక్కసారి కళ్ళుతెరచి చూడు. రేపొకసారి నా గదికిరా!" అని చెప్పి మధుమూర్తి వెళ్ళిపోయాడు.

మధుమూర్తి ఉపదేశం రామాన్ని కలవరపెట్టింది. అతను నిలబడిన నేల బీటలు వారినట్టనిపించింది.మధుమూర్తి మాటలు భయపెడుతూనే ఊరించాయి. రామానికి కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. ఆ సాయంత్రం రామం అలా షికారుగా వెళ్ళాడు.

రోజూ చూసే రోడ్లూ, బజారు, షాపులు అన్నీ కొత్తగా కనిపించాయి. ఈ ప్రపంచం అందరికీ అన్నీ ఇస్తుంది. కాని ఎవరిక్కావలసింది వాళ్ళు గుర్తు పట్టాలి.ఇన్నాళ్ళూరామం పట్టించుకోనిది, తప్పకు తిరిగినది ఇవాళ కావాలని చూస్తున్నాడు. హోటల్లో కాఫీ తాగి వచ్చి సిగరెట్టంటించాడు. ఎప్పుడో వదిలేసిన అలవాటు బాల్య మిత్రుడిలా పలకరించింది. ఆ కొట్టులో వేలాడే అనేక పత్రికలు, ఫోటోలు అతణ్ణి ఆకర్షించాయి. ఓ కొత్త ధైర్యంతో వాటిని పరిశీలించాడు. ఓ పత్రిక ముఖచిత్రం చాలా ఆకర్షణీయంగా వుంది. అర్ధనగ్న భంగిమలో ఓ సినీతార చిత్రం. ఆ పత్రికలో యువతరాన్ని మురిపించి, కవ్వించే శీర్షికలు చాలా వుంటాయని రామానికి తెలుసు. అది కొని ఇంటికి నడిచాడు.

రామం గదికి వెళ్ళి, మరో సిగరెట్టంటించి, పత్రిక తెరచి ఉత్కంఠతో చదవడం ప్రారంభించాడు. అతనికి కావలసిన మసాలా అంతా వుంది. ప్రశ్నలూ, సమాధానాలు, డాక్టరు సలహాలు, తారల ప్రేమ పురాణాలు, ఇలా అనేక రూపాల్లో, ముసుగులలో నరాలు వేడెక్కించే రచనలతో నిండి వుంది. బహుళ ప్రాచుర్యం పొందిన ఓ శీర్షికలో కథ చదవడం ప్రారంభించాడు.

ఒక గృహిణి. పాతికేళ్ళుంటాయి. భర్త ఉద్యోగరీత్యా ఇంటి పట్టున ఉండక ఊళ్ళు తిరుగుతుంటాడు. ఆమె విరహంతో వేగి పోతుంటుంది. ఇంటికొచ్చిన ఒక పరిచయస్తుణ్ణి ఆకర్షిస్తుంది. అతడిని తన పడక గదికి ఆహ్వానిస్తుంది. ఇద్దరూ గదిలోకి వెళ్ళి తలుపులు బిగిస్తారు. లైటార్పుతారు. ఆ తర్వాత? రచయిత పాఠకుడి ఊహకు వదలకుండా ఆ ప్రేమికుల ప్రతి కదలికనీ వర్ణిస్తాడు. "...నభిన్ నవలానొకానొక మరున్నారీ శిరోరత్నముః" అంటూ నాభి వరకు మాత్రం వర్ణించ సాహసించిన పెద్దన్నను దద్దమ్మనుచేసి ఆ రచయిత సెక్స్‌ని ఎక్స్‌రేలో చూపించాడు.

కథ చదివిన రామం నరాలు వేడెక్కిపోయాయి. వివేకం నశించింది. కిటికీలోంచి పెరట్లోకి చూశాడు.

రాగిణి మొక్కలకు నీళ్ళు పోస్తోంది. మోకాళ్ళ పై వరకు చీర దోపుకుంది. నీరెండలో ఆమెకాళ్ళు బంగారు ఛాయతో మెరుస్తున్నాయి. పమిట జారి వుంది.రామం ఇంతకు ముందుచూడని సౌందర్యం ఎదుటబడి ముగ్ధుణ్ణి చేసింది. ఉన్మత్తంగా రామం తన గదిలోంచి బయటకు వచ్చి ఆమెను సమీపించబోయాడు. తనవైపు వస్తున్న రామం చూపులు ఆమెను భయపెట్టాయి. ఆమె ఒక్క గంతులో ఇంటిలోకి పోయి గదియ వేసుకుంది. రామం హతాశుడై వెనక్కు మరలాడు. ఆ రాత్రంతా తన తొందరపాటును నిందించుకున్నాడు. మరో వారం రోజులైనా రాగిణి అతని కంటబడలేదు.

ఒకరోజు రామం మధుమూర్తి గదికి వెళ్ళాడు. మధుమూర్తి మధువు సేవించడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకుని కార్యక్రమం ప్రారంభించబోతున్నాడు. రామంరాక అతనికి మరింత ఉత్సాహాన్నిచ్చింది. మరో గ్లాసులో విస్కీ పోసి రామానికందించాడు. రామం కాదనలేకపోయాడు. ఓ కొత్త సాహసం, అవగాహన రామంలో పురి విప్పుకుంటున్నట్లుంది. మంటగా, మత్తుగా జీవితానికి ఓ కొత్త రుచి చూపిస్తూ గొంతులోకి జారింది మధువు. ఆ తర్వాత 'మరో గ్లాసు! మొదటిది మొదలు పెట్టడం కష్టం,ఆ తర్వాత ఆపడం కష్టం.

రామం తను చేసిన సాహసం, అంతలోనే ఎదురైన పరాభవం, నిరాశా మధుమూర్తికి చెప్పాడు. మధుమూర్తి రామానికి ధైర్యం చెప్పాడు. "ఫలితం కన్నా ప్రయత్నం గొప్పది. ఏ ఆడదీ తనకు తానుగా వచ్చి నీ వళ్ళో వాలదు. ప్రయత్నం మానకు.ఆమె నీకు తప్పక వశమౌతుంది. ఇది ప్రకృతి సహజం. మనం కట్టుకున్న నాగరికత అడ్డు తెరలుజారిపడిపోతాయి. జీవితంలో ఆనందమంతా కలిసి 'ఎక్స్' అనుకుంటే ఆ 'ఎక్స్' ఈజీక్వల్ టు 'సెక్స్' అని సమాధానం వస్తుంది. ఇది మధుమూర్తి మతిలేని సిద్ధాంతం కాదు. నీ చుట్టూ చూడు. ప్రపంచం అంతా అదే ఘోషిస్తోంది.

...ముకు సాగిపో! విజయం నీది!" మధుమూర్తి ఉత్సాహంగా సాగనంపాడు రామాన్ని.

రామం ఊగుతూ, తూగుతూ నగర వీధుల్లో నడుస్తున్నాడు. దీపాల కాంతిలో వీధులు కళకళలాడుతున్నాయి. ఆ వెలుగులో సినిమా పోస్టర్‌లలో చిత్రాలు కోరికల కోరల్లా గుచ్చుతున్నాయి. అర్ధనగ్న జవ్వనుల వొంపులువింత, వింత కోణాల్లో దర్శనమిస్తున్నాయి. స్త్రీ పురుషుల కౌగిళుల రహస్యాలను వివరించే భంగిమలు, మరో ప్రక్క నుంచి వారి పరిష్వంగాలలో నలిగిన గులాబీల, మల్లెల మూలుగుల కలస్వనాలు వినిపిస్తూ గీతాలు. కసి, కసిగా రాసిన గీతాలు. వాటికి భాష్యం చెప్పే సంగీతాలు! మహాకవుల కలాల్లోంచి, మహానుభావుల గళాల్లోంచి వెలువడుతున్న వింత సందేశాలు. యువతకు మార్గదర్శకాలు. సర్కారు వారి సమ్మతిని, సెన్సార్‌వారి ఆమోదం, ఆశీర్వాదాలతో దారికి ఇటూ, అటూ ఆడియో, విజ్యూ అల్ సెక్స్ ఎడ్యుకేషన్!

ఒక్కొక్క చిత్రం ఒక్కొక్క పెగ్.
ఒక్కొక్క పాట ఒక్కొక్క ఊపు!

ఇప్పుడు తెలిసింది రామానికి తన చుట్టూ ప్రపంచం ఎటువెళ్ళమని హెచ్చరిస్తోందీ. ఆ రాత్రి ఇంటికి చేరిన రామం కొత్త మనిషి!

అతడిని ఇన్నాళ్ళూ పీడించిన శంకలూ, భయాలు పటాపంచలైపోయాయి. తనక్కావలసింది, తను చేయవలసింది దృఢంగా విశ్వసించుకున్నాడు. రామానికి రాగిణి కావాలి. ఇంకా నిజాయితీగా, పచ్చిగా చెప్పాలంటే రామానికి ఓ స్త్రీ కావాలి! అతని మనసు మీద, శరీరం మీద పడుతున్న ఒత్తిడి ఇక భరించలేదు.

'రామానికా, ఇంత దారుణమైన ఆలోచనా' అని అతని అంతరాత్మ ఎక్కడో మూలిగింది. ఈ రామం దేవుడు కాదు. ఓ వంద త్రిశూలాలు గుచ్చుకుంటుంటే భరించగల ధీరుడు కాదు రామం. పత్రికలు, సినిమాలు, పాటలు పిచ్చెక్కిస్తుంటే నిలబడలేదురామం. రామం వాటి బరువుకి కూలి పోయాడు.

ఆ రాత్రంతా రామానికి నిద్రలేదు. రాత్రంతా సిగరెట్లు కాలుస్తూ కూర్చున్నాడు. ఓరాత్రివేళ ఇంటివాళ్ళ నాటా నుండి ఏవో వాదనలూ, ఘర్షణలూ వినిపిస్తున్నాయి. మధ్యమధ్యఇంటావిడ ఏడుపూ, మధ్య, మధ్య రాగిణి వెక్కి, వెక్కి ఏడవడం స్పష్టంగా వినిపించింది. ఎప్పుడూ ప్రశాంతంగా వుండే ఈ ఇంట్లో యివాళ యింత రాద్ధాంతం, ఏడుపులూ ఎందుకో రామానికి అర్థం కాలేదు.అలా ఆలోచనలతో ఎప్పటికో రామానికి నిద్ర పట్టింది.

ఎవరివో అరుపులకి రామం ఉలిక్కిపడి లేచాడు. తెల తెలవారుతూంది.ఇంటావిడ గొంతు చించుకు అరుస్తోంది. "అమ్మాయి నూతిలోపడింది బాబూ. రండి నాయనా, రక్షించండి" ఆమె అరుపులు రామం గుండెలను చీల్చినట్టయింది. లేచి ఒక్క దుముకులో పెరట్లోకి వెళ్ళాడు. 'రాగిణి నూతిలో పడింది బాబూ, రక్షించు నాయనా, నీ కాళ్ళు పట్టుకుంటాను!" ఆమె మాటలు పూర్తవకుండానే రామం వెళ్ళి నూతిలోకి దూకాడు.

రాగిణి అప్పటికే మునకలువేస్తూంది. రామం, నూతి ఒరలకి కాళ్ళుతొక్కి పెట్టి రాగిణిని బలంగా ఎత్తి బుజాన వేసుకున్నాడు. ఇంతలో చుట్టుపక్కలవాళ్ళు చేరి నూతిలోకి నిచ్చెన దింపారు. జారిపోతున్న ఆమెను బలంగా అదిమి పట్టుకుని రామం పైకి వచ్చాడు. రాగిణికి ప్రథమ చికిత్స చేశారు. బ్రతికే వుంది. అక్కడకు చేరిన జనం రామంచూపిన చొరవకూ, త్యాగానికీ వేనోళ్ళ ప్రశంసించారు. మరి కాసేపటికి రాగిణిని ఆసుపత్రికి తీసుకెళ్ళారు. రామంకూడా వెళ్ళాడు.

రామం మర్నాడుదయం మళ్ళీ రాగిణిని చూడ్డానికి ఆసుపత్రికి వెళ్ళాడు. కాని రాగిణిని మరోవార్డుకు మార్చారనీ,ఎవరూ ఇప్పుడామెను చూడకూడదని చెప్పారు. రామం, విషయం అర్థంకాక ఇంటికి తిరిగి వెళ్ళబోతుంటే రాగిణి తల్లి ఎదురైంది. రామాన్ని పక్కగా తీసుకెళ్ళి గుడ్ల నీరు కుక్కుకుంటూ చెప్పింది. "అందరూ నీ లాంటి మంచి వాళ్ళే వుంటారా బాబూ! నీ ముందర ఆ గదిలో ఓ పోకిరి వెధవ దిగాడు. వయసులో వున్నపిల్ల ! ఏం మాయమాటలు చెప్పాడో ఏమో దాని జీవితం కాస్తా నాశనం చేశాడు. అది నెల తప్పిందని మొన్న రాత్రే తెలిసింది. మేం తిట్టి పోశానునీ ఈ అఘాయిత్యం తల పెట్టింది. ఆ గర్భం కాస్తా పోయింది. పీడ విరగడైంది. అదీ మన మంచికే. మనిషంటూ దక్కింది. నీ మేలు జన్మలో మరిచిపోం బాబూ' అని వెళ్ళిపోబోతూ వెనక్కు తిరిగి పొంగివస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ అంది. 'బతికిందని సంతోషమేగాని, ఇక ఈ జన్మలో దాని పెళ్ళవుతుందా? మా పరువు, మర్యాదా గంగలో కలిశాక మేం బతికేం లాభం నాయనా" అని కళ్ళు ఒత్తుకుంటూ వెళ్ళిపోయింది.

ఈ వార్త విన్న రామం శిలలా మారిపోయాడు. కొద్ది క్షణాల వరకు అతనికి చైతన్యం రాలేదు. "ఎవడో దుర్మార్గుడు రాగిణి జీవితంతో ఆడుకుని వెళ్ళిపోయాడా! వాణ్ణి హతమార్చాలి!" రామం ఆవేశంతోకంపించి పోతూ గదికి చేరుకున్నాడు.'అయినా ముద్దరాలనుకున్నరాగిణి ఇంత నాటక మాడిందా? తల్లి దండ్రుల నెంత బాధ పెట్టిందా? ఛీ!' రామం తలలో నరాలు తెగిపోతున్నట్టనిపించింది. గదిలో ఒక్కసారి కుప్పగా కూలిపోయాడు రామం.

మరి కొద్ది నిముషాలకి తేరుకున్నాడు. ఆవేశం తగ్గింది. ఆలోచన మొదలైంది. ఎవరో రాగిణిని మోసం చేశారని ఎందుకూ ఉద్రేకపడటం? తను చేయబోయిందీ, చేయాలనుకున్నదీ అదేగా? ఆ పాపం తనకి చుట్టుకోకపోవటం కేవలం యాదృచ్ఛికం. ఏ పరిసరాలు తనని రెచ్చగొట్టాయో, వాటి ప్రభావానికి రాగిణి, ఆమె ప్రియుడూ లొంగిపోయారు.పురుషాధిక్య సమాజం కనుక ముందుగా రాగిణి జీవితం బలైపోయింది. కాని పురుషుడూదీనికి ఎప్పుడో మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఈ దిగజారిపోయే విలువలని రక్షించే సంస్కర్త ఎవరూ మన మధ్యలేదు!

యువత అంతా ఈ పాకుడు మెట్ల మీద నిలుచుంది. ఎవరికి వారే అప్రమత్తులై,ఆత్మశక్తితో గట్టు చేరాలి! లేదా, యీ జారుడు మెట్ల మీద నుండి ఎంత అధోగతి పాలవుతామో ఎవరికి తెలుసు?

రాగిణి ప్రాణం నిలబెట్టాడు. మరి ఆమె జీవితాన్ని కూడా నిలబెట్టగలడా? రామం తనని తను ప్రశ్నించుకున్నాడు. అంతటి సాహసం చేయగలిగినవాడే తిరిగి ఆమె ముఖం చూడగలడు. అంత 'వరకు ఆమెకు దూరంగా వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు.

రామం గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. ◆

## చిత్రణ

గుట్ట బోడితలమీద మొలిచిన చెట్టు పోచల్లా
బుర్రలో మరుగుజ్జు కదలికలు.
మగత సాి కదువులో కాళ్లూ చేతులూ ముడేసుకుని
మౌనావధా: చేస్తున్న నయన శిశువులు.
ఆకాశం పొదుగును చేతనైనంత పిండుకుని
చుక్కలు చుక్కలుగా బతుకుతున్న స్తన్యజీవులు.
పగిలిన అద్దంలో ముక్కలుగా పరుచుకున్న ప్రతిబింబం
వేళ్లనాళాల్లోంచి పిచ్చిరంగులు పుక్కిలించి నట్టుంది.
మృగాల సంతలో ఎలుగ్గొడ్లు వెల్లకిలా పడుకుని
ఎగిరెగిరి పడుతున్నట్టుంది.
వేరును భూమి పొరలో పాతిపెట్టి
వృక్షం మోకాళ్లమీద కవాతు చేస్తున్నట్టుంది.
అరాజకం అంగుళీచ్ఛాయలో అరికాళ్లూ ముఖాలూ
ప్రత్యేక వాహనాలమీద ఊరేగుతున్నట్టుంది.
అదేమిటో ఆ అక్షరాలు కాగితం నేలమీద
అరంగుళం పైన ఈదుతున్నాయి నగ్నంగా.
మట్టిమీదికి దిగితే వాటి ఒంటి చుట్టూ
మర్యాదల దుస్తులు మొలుస్తాయని భయమా?
విచ్ఛిత్తికి దారితీసే వికృతి స్వచ్ఛమైన ఆకృతి కాదు.
సమ దర్శనం లోపించిన ప్రకృతి సమగ్రసృష్టి అనిపించుకోదు.
ఉన్మాదం సీసాలో దింపి బిరడా బిగించిన
మూడుతలల భూతం కాదు జీవితం.
అగాధ స్వప్నం సాచే లోయల బాహువుల్లో
అర్థరహితంగా మూల్గే ఆలాపన కాదు జీవితం.
రెండు గట్లనూ నీటి కౌగిట్లో పొదుగుకుని
దివారాత్రులు సాగిపోయే ప్రవాహం జీవితం.
చలి కోస్తున్నప్పుడు అలల దుప్పట్లు కప్పుకుని
ఎండ కాస్తున్నప్పుడు నురగల గొడుగులు పట్టుకుని
లయలా పయనించే ప్రవాహాన్ని చిత్రించు –
అదే జీవితమయిపోతుంది అక్షరాలా.

— డా. సి.నారాయణరెడ్డి

## ◇ పార్ట్‌టైమ్..

ఒకామె ఫ్యాన్సీ షాపు యజమానితో కంప్లెయింట్ చేస్తోంది:
"గాజులు సెలెక్ట్ చేసుకుని తొడగమంటే అరచేతులు, మోచేతులు, భుజాల దాకా తాకుతాడేమిటి మీ కుర్రాడు?"
"సారీ మేడమ్... మా వాడు పార్ట్‌టైమ్ టైపిస్ట్. చకచకా వేళ్ళు కదిలించడం అలవాటై పోయింది... సారీ సారీ...!" అన్నాడు యజమాని.